# జారిన గులాబి

అనుమానిస్తూనే ఓరగా వేసివున్న తలుపు నెట్టి లోపలి కడుగుపెట్టేడు మూర్తి.

కూర్చున్నవాళ్ళంతా తడబాటు కొద్దీ గబగబా లేచారు.

సభ్యత గుర్తుకువచ్చి ఓ అడుగు వెనక్కు వేసి అక్కడే నిలబడ్డాడు మూర్తి. గాజుల గలగలలు ... పట్టుకోకల గరగరలు ... చకితచకిత నేత్రాలు ... నునుసిగ్గు దొంతరలు—మెఱుపుల్లా అతని మస్తిష్కాన్ని సందడి పెట్టినయ్ ఓ క్షణం.

కమల...!— చాలా రోజులకు కన్పించింది. అందరి కంటె వెనగ్గా వెళ్తూ మూర్తివైపు తిరిగి చూచింది.

తెల్లగా పాలిపోయినా ... పల్చబడిన కపోలాలు నున్నగా అద్దాల్లా ఓ వినూత్న కాంతిని పుణికి పుచ్చుకొన్నట్టు మెరిసిపోతున్నయ్. ఏదో తెలీని ఉత్సాహం, తృప్తీ ఆమె చూపుల్లో దోబూచులాడింది. జారుముడి వేసిన కొప్పుమీద తురుంకొన్న గులాబీ ఆ సందడిలో క్రింద జారిపడింది. దానిని వంగి తీసుకోబోతూ మూర్తి వైపు మళ్ళా చూచి...అక్కడే విడిచిపెట్టి దొడ్లోకి వెళ్ళిపోయింది కమల.

'ఇప్పుడే వస్తానుండం' డని బాబిగాణ్ణతని చేతి కందించి అతిథిమర్యాదలకు వంటయింట్లోకి పరుగెత్తింది పద్మ.

ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా వున్న మూర్తి బాబిగాడి పలకరింపుతో మామూలుమనిషి అయ్యాడు.

"నాన్నా...నాన్నా...!" అంటూ జేబులోని బిస్కట్టుపొట్లాన్ని బయటికి లాగేడు ఆ ముద్దుల కొడుకు.

అర్ధాంగిని కేక వేసినా లాభంలేదని ... బాబిగాణ్ణి దింపి ... చొక్కా వంకెకు తగిలించి...ఈజీ ఛైర్లో చతికిలబడ్డాడు మూర్తి.

కమల కొప్పులో నుంచి జారిన గులాబీ ఇంకా అక్కడే ఉంది. ఏం తోచిందో...ఏమో, నెమ్మదిగా లేచి, అటూ యిటూ చూచి, ఆ గులాబీ అందుకున్నాడు మూర్తి. బిస్కట్లపని పట్టటంలో మునిగిపోయాడు బాబు... తండ్రి జోలికి పోకుండానే.

గులాబీ...కమల తలలోని గులాబీ ...ఇంకా వసివాడలేదు. అప్పుడే కోసినట్టుంది. గులాబీ వరుసలకేసి చూశాడు మూర్తి.

ఉదయం తాను ఆఫీసు కెళ్తూ చూసిన గులాబీమొగ్గ అక్కడ లేదు.

'రత్నం'

అవన్నీ తాను స్వయంగా పెంచినవి. కమల పంపిన ఆ అంట్లు పద్మా తానూ కలిసి స్వయంగా నాటి పెంచి పెద్ద చేశారు ఆరోజే పూచింది తొలిమొగ్గ.

పద్మ తుంచబోతే ... వద్దని వారించి తాను ఆఫీసుకు పోయాడు.

అది కమల కొప్పులోకి ఎక్కి, ఇప్పుడు తన చేతిలో నలుగుతూ ఎర్రగా నవ్వుతున్నది.

రోజూ యీ సరికి ఎదురెదురుగా వచ్చి కాఫీ అందించేది పద్మ. ఆఫీసు పనిలో విసిగిపోయిన అతని హృదయానికి ప్రియురాలి చిరునవ్వులు ఉపశాంతిని కలిగించేవి. స్నేహితురాళ్ల రాకతో మూర్తికి ఆ యోగం కాస్తా తప్పిపోయింది.

గోడ వారగా వాల్చివున్న మంచం వైపు వెళ్ళి సుపుత్రుడు కేరింతలు కొట్టడంతో, పరధ్యానంగావున్న మూర్తి దృష్టి అటు తిరిగింది. పైన కప్పివున్న ముసుగు లాగుతూ వాడు చిలిపిగా మూర్తివైపు చూశాడు.

ఆ మంచంమీద నిద్రపోతున్న పాప మూల్గుతూ అప్పుడే యిటు ఒత్తిగిలింది.

మూర్తి లేచి వెళ్ళి పాపను పరీక్షగా చూశాడు. పాలబుగ్గలతో... పసిడిబొమ్మలా ఎంతో ముద్దుగా వుంది. దగ్గరగా కుర్చీ జరుపుకొని నిద్రపోతున్న పాపవైపు అదే పనిగా చూస్తూ కూర్చున్నాడు మూర్తి. అనూహ్యమైన వాత్సల్యమేదో అతన్ని చుట్టివేసింది. ఏదో ఉపశాంతి అతని మనసుపైన పన్నీటిజల్లు చల్లింది.

ప్రభాతపు నీరెండ పడి తళుకు లీను తున్న బాదమాకులు పైరుగాలికి మెల్లగా కదిలినయ్.

పాప నిద్రలో నవ్వుతున్నది ... బుంగమూతి పెడుతున్నది ... ఆ పిల్ల గాలి జోలపాటలో మైమరచి మంద మందంగా ... సుదీర్ఘంగా ఉచ్ఛ్వాస నిశ్వాసాల్ని విడుస్తోంది. నిద్రపోతున్న పాప పాలబుగ్గల మీద మురిపెంకొద్దీ ముద్దు కురిపించాడు మూర్తి.

ప్రత్యూషంలా మెరిసిపోతూన్న ఆ పసికందును చూసినకొద్దీ ... ఆ రూపు రేఖల్ని పరికించడం నిశితమైనకొద్దీ ...ఎన్నెన్నో ఆలోచనలు ... ఏవేవో గతస్మృతులు మూర్తి మస్తిష్కంలో సుడులు తిరగడం మొదలెట్టినయ్....

కమల పుట్టడానికి పెద్దింట్లోనే పుట్టింది. ఇరవై వేల నగదుతో పాతిక ఎకరాల కట్నంతో అత్తవారింటికి వెళ్ళింది. పెద్ద మేడా...పిలిస్తే పలికే పనివాళ్ళూ...అత్తా ...ఆడబడుచులూ అంతా పచ్చపచ్చగానే ఉంది.

ఎన్ని సుఖాలున్నా...ఎంత భోగం అనుభవిస్తున్నా పదేళ్ళ కాపురంలో భంగపాటే కన్పించింది కమలకు.

భర్త మాటిమాటికీ 'కట్నం డబ్బు తే' అని ఎత్తిపొడిచే వాడు సూటీపోటీలతో. తండ్రేమో అడిగినప్పుడల్లా 'నీ కడుపున ఓ కాయ కాస్తే

ఇప్పటి కిప్పు డిక్చేస్తా' నని వాయిదా వేసేవాడు. అత్త కాకిమీదా, పిల్లి మీదా పెట్టి తన గొడ్రాలితనాన్ని ఆక్షేపించేది. పండగా పబ్బాలకు పిల్లా జెల్లాతో ఇంటినిండా నిండుకొనే ఆడ బడుచులు చూపే తిరస్కారానికి అంతే లేదు. అటు పుట్టినింటి వారికీ, ఇటు మెట్టినింటివారికీ డబ్బు కేమీ కొదువ లేదు. కాని కమలకు సుఖశాంతులే లేవు. ఒకళ్ళు పిసినారులు, వ రొకళ్ళు కర్కోటకులు! ఆ యింట్లో ... ఆ బంగారు పంజరంలో తా ననుభవిస్తున్న నీచస్థితిని తల్చుకొని ఏకాంతంగా కుమిలికుమిలి ఏడ్చేది కమల.

ఆ రాత్రి నిగ్గదీసి అడిగేడు వెంక టేశం. 'కట్నం తెస్తావో ... పుట్టింటికి శాశ్వతంగా పోతావో చెప్పమని. నోరు మెదపక కన్నీరు కార్చింది.

ఇంతకీ తాను గొడ్రాలు! తీరని సమస్య అయికూర్చున్న ఆ సుడి గుండంలో ప్రేమా ... మమతా ... అను బంధమూ ... మసిమసి అయిపోవడంతో గతిలేక పుట్టింటికి బయలుదేరింది కమల. కాళ్ళావేళ్ళాబడి తండ్రిని బ్రతిమాలింది—'ఆ కట్నం డబ్బు పారేసి తన కాపురం నిల్పమని. తండ్రి అదే పాట .. 'నీ కడుపున ఓ కాయు కాస్తే వడ్డీతో సహా ఇప్పటి కిప్పు డిచ్చేస్తా'నని.

సంవత్సరం గడిచిపోయింది కమల పుట్టింటికి వచ్చి. భర్త తిరిగి తీసుకొని వెళ్ళే సూచన లేమీ కన్పించలేదు.

కలవారింటి బిడ్డ కాబట్టి కమలకు తిండి కేమీ లోటు లేదు. నాలుగు మెతు కులు కొరకటం.. కిటికీగుండా శూన్యం లోకి చూడటం—ఇదీ రోజువారీ పని మనోవ్యాధితో చిక్కి సగమైపోయింది కమల. సహజంగా భాగ్యవంతుల యిళ్ళల్లో పెరిగే కండలన్నీ కరిగిపోయినె

అప్పుడే దిగేరు ఎదురుగా వున్న యింట్లోకి మూర్తి-పద్మా. పద్మతో పరిచయం, కుదిరి కమల కదో కాలక్షేప మయింది. అదే క్రమంగా గాఢ స్నేహంగా మారింది.

పద్మ నెలలు నిండి పుట్టింటికి పోతుంటే కన్నీళ్ళు పెట్టుకొని చీరె సారెల్తో పసుపుకుంకుమలు పెట్టి వీడ్కో లిచ్చింది కమల. హృదయం భారంగా వున్నా, పద్మ సౌభాగ్యానికి మురిసింది

హోటల్ భోజనం చేస్తున్న మూర్తి యోగక్షేమాల్ని పనివాళ్ళ ద్వారా కనుక్కొంటూ పరోక్షంగా ఎంతో సాయపడింది.

పద్మ ఉత్తరంకూడా వ్రాసింది.. 'కాస్త మంచీ చెడూ చూస్తుండు' అని

ఆ రోజు మూర్తి తల నొప్పిగా ఉంటే ... అమృతాంజనం పులుంకొని కళ్ళు మూసుకొని పండుకొన్నాడు.

'ఎలా ఉంది తలనొప్పి ?'—పరిచిత కంఠం విన్పించి మూలుగుతున్న మూర్తి కళ్ళు తెరచి చూశాడు.

ఎదురుగా గడప ప్రక్కన కమల

మొదటిసారిగా తనను పలకరించింది తొట్రుపడుతూ.

పద్మ ఉండగా ఎంత పలకరిద్దామనుకున్నా ఎదుటపడేది కాదు. తాను ఆఫీసునుంచి రావటం ... కమల దొడ్డిదారినే తుఱ్ఱుమనటం రోజూ జరిగేది.

ఎదురుగా వున్న కమలను చూచి లేచి కూర్చున్నాడు మూర్తి తడబడుతూ. పనిమనిషి ఫ్లాస్కుతో తెచ్చిన కాఫీ కప్పులో పోసి, ఎదురుగా పెట్టి 'త్రాగండి' అన్నట్లు సైగ చేసింది కమల. కాఫీ గుటకలు వేస్తూ కమలవైపు పరీక్షగా చూశాడు మూర్తి.

తలంటు పోసికొని జారుముడి వేసుకొన్నది. ఒక్కటే ఒక్క గులాబీ తలలో తొంగిచూస్తున్నది. చిలుక పచ్చచీర ఆమె దేహానికి మెరుగులు పెడుతున్నది. అన్నిటికంటె ఆ కళ్లలో మెరుపులు మూర్తిని ఉక్కిరిబిక్కిరి చేసినయ్. పొలమారింది మూర్తికి.

'పద్మ తలచుకొంటున్నదల్లే ఉంది?' పరిహాసంగా అంది కమల.

పొలమరింతకు కన్నీళ్లు వచ్చినయ్. కళ్లు తుడుచుకొంటూ మరింత సిగ్గుపడ్డాడు. నోరు పెగల్లేదు మూర్తికి.

'ఎంత చక్కగా పలకరించింది తనను!' ఆ మాటల్లో ... చేతల్లో సభ్యత . సంస్కారం కొట్టవచ్చినట్లు కన్పించినయ్ మూర్తికి.

పనిమనిషి చేత ఇల్లు తుడిపించి, పక్క దులిపించి ఇల్లంతా కలయ తిరుగుతున్న కమల కదలికల్ని పరీక్షగా చూశాడు మూర్తి. తాను ఇంట్లో ఎదురుగా ఉన్నా లేడన్నట్టుగానే ప్రవర్తించింది కన్నెత్తి చూడకుండా.

వెళ్తూ వెళ్తూ తలుపు దగ్గరకు ఆగి మూర్తివైపు అప్పుడు చూసింది. మళ్ళా కళ్ళల్లో ... అవే మెరుపులు!

తల నొప్పి చేత్తో తీసేసినట్టయి. లేచికూర్చుని మేగజైన్ విప్పటం మొదలెట్టేడు ఏమీ తోచక. కాని కమల గుర్తుకు వచ్చి, ఆ పత్రికను గుండెల మీద పెట్టుకొని ఏదో ఆలోచిస్తూ అలానే నిద్రపోయాడు మూర్తి...

ఉన్నట్టుండి ఊరంతా ఉలిక్కిపడింది.

ఆ రోజు కమల సీమంతం!

అమ్మలక్కలందరూ కళ్ళల్లోకి సాభిప్రాయంగా చూసుకొంటూ ... పళ్ళూ ఫలహారాలూ దండిగా పట్టుకెళ్లేరు. కొత్తగా కాపరానికి వచ్చిన కోడళ్లు తనవైపు వింత వింతగా చూస్తుంటే కమలకేమీ వణుకుపుట్టలేదు. భయం అంతకన్నా లేదు.

తనకీనాడున్న గౌరవం గడచిన జీవితంలో ఎప్పుడూ లేదు. లోకమూ, పుట్టిల్లూ, అత్తిల్లూ తనకిస్తున్న ఉన్నత స్థానానికి నవ్వుకుంది.

పద్మ యింకా పుట్టింటినుంచి రాలేదు. ఆ శుభసమయంలో అదొక్కటే లోటుగా కన్పించింది కమలకు. పద్మ నిజంగా తన నెచ్చెలి ... ఆత్మీయురాలు ... ప్రాణంలో ప్రాణం. తనకు జీవాన్నీ ... జీవితాన్నీ ఇచ్చింది నిజంగా పద్మే! కృతజ్ఞతా చిహ్నంగా

పళ్ళూ ఫలహారాలూ మనిషినిచ్చి పద్మ ఉంటున్న ఊరు పంపించింది...సుదీర్ఘమైన లేఖ వ్రాసి...

కమలా వాళ్ళ యింటినుండి వచ్చిన ఫలహారం తింటూ దొడ్లో ఈజీచైర్ వేసుకొని, యథాలాపంగా ఎదరగా ఉన్న మేడపైకి చూశాడు మూర్తి.

పిట్టగోడ ప్రక్కగా కమల!

ఆ సంధ్యారుణ కాంతిలో మెరిసి పోతున్నది. తనవైపే చూస్తున్నది.

ఎంత అందంగా ఉంది కమల!

కమల తల్లి కాబోతున్నది.

తాను... తాను-ప్రశ్న ప్రశ్నగానే మిగిలింది మూర్తికి. అది లోకానికీ... తనకూ మ్రింగుడుపడని ప్రశ్న!

* * *

గతమంతా గుర్తుకు వచ్చింది మూర్తికి, ఆ పసిపాప వైపు చూస్తుంటే.

తలుపు తోసిన చప్పుడుతో మూర్తి ఆలోచనలన్నీ చెదిరిపోయినయ్. కాఫీ కప్పు అందిస్తున్న పద్మ వైపు, దోషిలా ఫీలవుతూ చేయి చాపేడు మూర్తి.

'కమల కూతుర్ని తీసుకొని వాళ్ళింటికి పోతున్నది. మీకు చూపించాలని వచ్చింది!' - తనవైపు చిలిపిగా చూస్తూ అంటున్న అర్ధాంగి మాటల్లోని వ్యంగ్యం మూర్తిని దడదడలాడించింది. 'తనకు చూపించడానికి వచ్చిందట!'

బాబిగాడి కేకల్తో లేచిన పాప బద్ధకంగా కళ్లు తెరిచింది.

'ఎన్నాళ్ళకు కన్పిస్తుందో ఏమో! ఎలా చూస్తోందో చూడండి మీ వైపు. కాస్సేపు ఎత్తుకోండి!' - మూర్తి కందించింది పద్మ కమలకూతుర్ని.

మూర్తి యంత్రంలా చేతులు చాపి, పాపను పొదివిపట్టుకొని, ఇల్లాలివంకా, ఒళ్ళోఉన్న కమల కూతురివంకా ఎంత సేపు చూశాడో, ఎలా చూశాడోగాని, ఒక్క నిట్టూర్పు విడిచాడు చివరికి.

బజారులో ఎద్దుల మెడలోని గంటలు గణగణమన్నయ్. కమల బండి ఎక్కబోతూ 'పద్మా!' అని కేకవేసింది, స్నేహితురాలికి చెప్పి పోదామని. పాపను అందించడానికి బజారు వాకిట్లోకి వెళ్ళింది పద్మ.

భార్యను వేసిన కేక తట్టి లేపుతున్నట్టు ... తననే పిలిచినట్టు ఫీలయిన మూర్తి అలానే భార్యవెంట తానూ వచ్చాడు వాకిటిదాకా.

బండిలోనుండి రెండు కళ్ళు, సంతృప్తీ ... సంపూర్ణతా ... కృతజ్ఞతా నిండిన రెండు మెరుపులు మూర్తి గుండెల్ని బళువెక్కించినయ్.

ఒక్క నిట్టూర్పు విడిచి భారంగా వెనుదిరిగేడు మూర్తి.

కమల తలలోనుంచి జారిన గులాబీ ఇంకా తన చేతిలోనేఉంది. దానిని జాగ్రత్తగా తన డైరీ అరలో భద్రపరచాడు.

ఆ రాత్రి అన్నది పద్మ 'మీ రెంత రసికులండీ! మీ డైరీ...చూశాను! గులాబీకూడా ఉన్నదే అందులో!

తెల్లబోయాడు మూర్తి-ఒక్కసారి, ప్రియురాలిని గుండెల కదుంకొంటూ!